## క్లుప్తంగా

### బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిని బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో జ్యేష్ఠ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

### 31న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31న బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ విజయసారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

### 'నందమూరి విజయభేరి' పుస్తకం ఆవిష్కరణ



అమర్తలూరు(వేమూరు): ఎన్టీఆర్ జీవిత చరిత్ర పద్య రూపక పుస్తకావిష్కరణ ఆదివారం చేశారు. అమర్తలూరుకు చెందిన విశ్రాంత లైబ్రేరియన్ ముప్పా సుబ్బారావు 100 పద్యాలుగా నందమూరి విజయభేరి పుస్తకం రచించారు. మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు నేటికీ మరువలేమన్నారు. ఆయన జయంతి ఉత్సవాలు పార్టీలకతీతంగా నిర్వహించడం జరిగిందన్నారు. రత్నచార్యులు, మోదుకూరి వెంకటరత్నం, దేవరపల్లి అంబేద్కర్, కొడాలి శ్రీధర్, రాయపాటి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



రేపల్లె: టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నెహ్రూబొమ్మ సెంటరులో అన్నదానం చేశారు. నాయకులు అనగాని శివప్రసాద్, జీపీ రామారావు, జీవీ నాగేశ్వరరావు, పొన్నూరు గౌరీ రామకుమారి, మోర్ల అరుణకుమారి, దున్నా జయప్రద తదితరులు పాల్గొన్నారు.

### కోనేటిపురం డొంక రోడ్డుకు మోక్షం



భట్టిప్రోలు: దశాబ్దాల తరబడి అధ్వానంగా ఉన్న కోనేటిపురం డొంక రోడ్డుకు మోక్షం లభించింది. కోనేటిపురం గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి డొంక రోడ్డుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఇటుక, మురుము, మట్టి తోలి జేసీబీతో చదును చేశారు. గతంలో ఈ రహదారి గుంతలమయమై రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆదేశాలతో గ్రామ సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని) ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను చేయిస్తున్నారు.

### సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

కాకుమాను: సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. కార్యాలయంలో ఆదివారం మండలంలోని రేషన్‌షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ పద్మజ, రేషన్ షాపు డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జననం, మరణం.. నమోదు 21 రోజుల్లోనే

- జనన, మరణ వివరాలు నమోదు చేసుకుంటే సర్టిఫికెట్లు సులభం
- ఆపై..రూ. 50 చలానా చెల్లించి, సర్టిఫికెట్ పొందాలి
- ఏడాది గడిస్తే ఆర్డీఓ ప్రొసీడింగ్స్‌తో సర్టిఫికెట్లు జారీ
- 2016 నుంచి డిజిటల్ సర్టిఫికెట్ల మంజూరు



బాపట్ల తహసీల్దారు కార్యాలయం

బాపట్ల అర్బన్: ఆధార్, రేషన్ కార్డు కావాలన్నా జనన ధృవీకరణ పత్రం తప్పనిసరి. 2009 కంటే ముందు జన్మించిన, మరణించిన వారి ధృవపత్రాలు ప్రస్తుతం పొందాలంటే సచివాలయం, తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మొదట్లో పంచాయతీ, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాల పరిధిలో జనన, మరణాల వివరాలను నమోదు చేసుకునేవారు. అనంతరం సర్టిఫికెట్ల జారీని.. తహసీల్దారు కార్యాలయానికి మార్చారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సదరు సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శులు రికార్డులను పరిశీలించి, ఒక రోజులోనే మంజూరు చేసేవారు. 2016 నుంచి జనన, మరణ ధృవపత్రాలు జారీని ఆన్‌లైన్ చేశారు. పుట్టినా లేదా మరణం సంభవించినా.. 21 రోజుల్లోగా గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్వాడీ, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వివరాలు నమోదు చేయిస్తే.. పైసా ఖర్చు లేకుండా సులభంగా సర్టిఫికెట్లు పొందవచ్చు. 21 రోజుల సమయం దాటిందంటే ఆన్‌లైన్‌లో జనన, మరణ వివరాలు నమోదు చేయడం కష్టతరమవుతోంది. దీంతో సర్టిఫికెట్ల మంజూరుకు వ్యయ ప్రయాసాల కోర్చాల్సి ఉంటుంది.

**తహసీల్దారు అనుమతి తప్పనిసరి**

21 రోజుల్లో గా జనన, మరణ తేదీలను నమోదు చేయించుకోవాలి లేకుంటే.. సర్టిఫికెట్ కావాలంటే గ్రామ సచివాలయంలో నాన్ అవైలబుల్ ఫారం 10 ఇస్తారు. దాన్ని తీసుకొని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆన్ లైన్‌లో రూ.50లు చలానా చెల్లించాలి. దీంతో తహసీల్దారు జనన, మరణ సర్టిఫికెట్లు మంజూరు కోసం ప్రొసీడింగ్స్ ఇస్తారు. దాని ఆధారంగా చేసుకుని గ్రామ పంచాయతీ కాదర్శి ఆన్‌లైన్‌లో తేదీలను నమోదు చేసుకుని సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు.

**ఏడాది దాటితే..**

పుట్టిన, మరణించిన తేదీలు ఏడాది పైబడితే రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రొసీడింగ్స్ పొందాల్సి ఉంటుంది. ముందుగా తహసీల్దార్ వద్ద నాన్ అవైలబుల్ సర్టిఫికెట్ పొందడంతో పాటు రూ. 50లు చలానా చెల్లించి, ఆర్డీవో కార్యాలన్నీ సంప్రదించాల్సి ఉంటుంది. అన్ని రికార్డులను పరిశీలించిన తర్వాత ఆర్డీఓ సర్టిఫికెట్ల జారీ కోసం పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా ధృవపత్రాలు మంజూరు చేస్తారు. వీటిని అన్నింటికీ కనీసం వారం రోజుల నుంచి పక్షం రోజులు సమయం పడుతుంది.

### సకాలంలో వివరాలు నమోదు చేయించుకోవాలి

గ్రామాల్లో ఎవరైనా జన్మించిన, మరణించిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే 21 రోజుల్లో గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాల్లో, తేదీ, పేరు వివరాలు నమోదు చేయించుకోవాలి. లేకుంటే.. ఆన్‌లైన్ ధృవపత్రాలు మంజూరు కష్టమవుతుంది. ప్రొసీడింగ్స్ తీసుకొని దానిననుసరించే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది.

– కె.సుధారాణి, తహసీల్దారు, బాపట్ల

### 21 రోజులు దాటితే ఆన్‌లైన్‌లో నమోదు కాదు



ఆన్‌లైన్ ద్వారా 2016 నుంచి జనన, మరణ ధృవపత్రాలు జారీ చేస్తున్నారు. 21 రోజుల్లోగా వివరాలు ఆన్ లైన్ చేయకపోతే.. ఆ తర్వాత వివరాలు నమోదు చేయడం కష్టమవుతుంది. గడువు దాటితే తహసీల్దారు ప్రొసీడింగ్స్ తీసుకొని సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉంటుంది.

– ఎ.రాధాకష్ణ ఎంపీడీఓ, బాపట్ల.

# అట్టహాసంగా ఎడ్ల పందేలు



విజేతగా నిలచిన ఎడ్ల జత యజమానికి నగదు బహుమతి ప్రదానం

బాపట్ల అర్బన్: మండలంలోని నరసాయిపాలెం గ్రామంలో మరియమ్మ తల్లి ఏసుక్రీస్తు స్వరూపాల మూడో ప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పందేలు అట్టహాసంగా ఆదివారం జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పోటీలను వీక్షించేందుకు ప్రజలు తరలి వచ్చారు. పోటీల్లో గెలుపొందిన వారికి యువ పారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్ నగదు బహుమతి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అంతరించిపోతున్న ఎడ్ల పందేలు, సాంఘిక నాటికలు గుర్తుచేసేలా నరసాయపాలెం గ్రామస్తులు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు, సాంప్రదాయ క్రీడలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వెల్లడించారు. ఎడ్ల పరుగు పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన స్టువర్టుపురం ఎడ్ల యజమాని బొప్పు జయంతికి రూ.20,116లు నగదు, మెమొంటో అందజేశారు. రెండో బహుమతి పమిడిపాడుకు చెందిన ఎడ్ల యజమాని నల్లమోతు హరీష్ కుమార్ రూ.15,116లు, మెమెంటో వైఎస్సార్ సీపీ నాయకులు కళ్ళం హరనాథ్‌రెడ్డి, సర్పంచ్ దాసి సుదర్శన్ రావు ప్రదానం చేశారు. మూడో బహుమతిని కేతిరెడ్డి పాలెం ఎడ్లు యజమాని చిరంజీవికి రూ.10,116లను చీమలదిన్నె శ్రీనివాసరావు, మాల్యాద్రి.. 4వ బహుమతి నరసాయపాలేనికి చెందిన నక్క వీరయ్యకు రూ.5,116లను నరసాయపాలెం ఎంపీటీసీ దేవరపల్లి నాని జయమణిల సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసి కిషోర్, జంగా పేతురు, మామిడి సుందరరావు, మహేష్, పాదర్తి చిట్టి, దుగ్గిరాల చిన్నబ్బాయి, దేవరపల్లి చిలకయ్య, దాసి సుదర్శన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ విద్యార్థులకు, ప్రజా ప్రతినిధులకు సత్కారం



విద్యార్థిని తేజశ్వినీకి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న సంఘ నేతలు

తెనాలి: యాదవ ఎంప్లాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలో పదో తరగతి ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థులను నగదు ప్రోత్సాహకాలను ప్రదానం చేసి, సత్కరించారు. అలాగే తెనాలి, పరిసరాల్లోని యాదవ ప్రజా ప్రతినిధులను సన్మానించారు. రైల్వే స్టేషను రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన సభకు.. ఫౌండేషన్ ఆర్గనైజరు ఎనికపల్లి అంబరీషుడు అధ్యక్షత వహించారు. మొత్తం 43 మంది విద్యార్థులకు నగదు అతిథులు చేతుల మీదుగా అందజేశారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష స్వరూపరాణి, తెనాలి కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తాడిబోయిన రాధిక, తోట రఘురాం, తాడిబోయిన రామయ్య, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, కుర్రా సుజాత, కో–ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు, చింతలపూడి సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, అత్తోట సర్పంచ్ దేశబోయిన నాగ బసవేశ్వరరావును సత్కరించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ ఎనికపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ నల్లమేకల శివరామకృష్ణ పాల్గొన్నారు. డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. గడవర్తి సుబ్బయ్య, దొడ్డక సాంబశివరావు, ఫౌండేషన్ ప్రతినిధులు కేదార్‌నాథ్, శ్రీనివాస పండిట్, మీసాల బాలాజీ, కాటుపల్లి శ్రీనివాసు, కొత్తగొర్ల శ్రీనివాస్, బ్రహ్మేశ్వరరావు, ఏసుబాబు, తాడిబోయిన రమేష్‌బాబు, తోట రాజారావు, కుర్రా విజయలక్ష్మి పర్యవేక్షించారు.

# శబ్ద సాధన.. గొప్ప వ్యాయామం

**సంగీత విద్వాంసుడు 'కలైమామణి' తాడేపల్లి లోకనాథశర్మ**



లోకనాథశర్మ దంపతులను సత్కరించిన అసోసియేషన్ నేతలు

తెనాలి: నాదానికి గల శక్తి గొప్పదని, శబ్దసాధన గొప్ప వ్యాయామంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు 'కలైమామణి' బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాథ శర్మ అన్నారు. నాదంతో శరీరంలోని అన్ని భాగాల్లో కంపనలు వస్తాయని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో సంగీతం–సాహిత్యం అంశంపై లోకనాథశర్మ మాట్లాడారు. సంగీతంలో ప్రతి అక్షరానికి ఒక ధ్వని ఉంటుందన్నారు. ఆ ధ్వని ఇచ్చినపుడు రాగరంజితం అవుతుందని చెప్పారు. ధ్వని, స్వర, లయ, పద భ్రంశాలు చెందటమే, ప్రకృతి వైపరీత్యాలకు కారణమని వ్యాఖ్యానించారు. అప్రభ్రంశం ఆగేవరకు అవి వస్తూనే ఉంటాయని తెలిపారు. త్యాగరాజు, రామదాసు వంటి వాగ్గేయకారుల సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, మననం చేసుకుంటే చాలని చెప్పారు. ఆయా కీర్తనలను ఆలపిస్తూ, అర్థాలను విడమరిచి చెప్పారు. తొలుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు లోకనాథ శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. గత నెలలో మృతిచెందిన జీవితకాల సభ్యులు డాక్టర్ పసుపులేటి వెంకటరమణ, వీడీఆర్ మనోహర్, ధూళిపాళ్ల కృష్ణారావుకు నివాళులర్పించారు.

### నేడు వంటీర్లకు వందనం కార్యక్రమం

కొల్లిపర: ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తిస్తూ నిర్వహిస్తున్న వంటీర్లకు వందనం కార్యక్రమం కొల్లిపర గ్రామంలోని కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొల్లిపరలోని సచివాలయాలు 1, 2, 3, మున్నంగిలోని సచివాలయాలు 1, 2, వల్లభాపురంలోని సచివాలయాలు 1, 2, పిడపర్రు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సన్మానిస్తారని చెప్పారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

### వివాహిత అదృశ్యం

బాపట్లటౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పట్టణంలోని డీఎం పల్లి కొత్తపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొత్తపేటకు చెందిన యశోద తన కుతూరు, కుమారుడిని తీసుకొని ఈ నెల 27న ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఇప్పటి వరకు తిరిగి రాలేదంటూ ఆమె తల్లి కట్టుపల్లి సియోనుకుమారి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ సింగయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### ఇద్దరు జూదరుల అరెస్ట్

వేమూరు: ఇద్దరు పేకాట జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చోడయ్య తెలిపారు. ఆదివారం జంపని పొలాల్లో పేకట ఆడుతుండగా.. ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారయ్యారని తెలిపారు. రూ.1,660నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### ఇంట్లో చోరీ

గుంటూరు రూరల్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన గుంటూరు రూరల్ నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పొదిలి తిరుపతిరావు సాఫ్టవేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ గుంటూరు నగరంలో నివసిస్తున్నాడు. నరసరావుపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి అక్కడకు వెళ్లారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని వంద గ్రాముల బంగారం, ల్యాప్‌ట్యాప్‌లు, సెల్ ఫోన్లు, రూ. 5వేలు ఎత్తుకుపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తిరుమలరావు లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

### మజ్జిగ పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి బస్ షెల్టరులోని చలివేంద్రంలో ఆదివారం మహాప్రస్థానం సేవా సమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, 3వ వార్డు కౌన్సిలరు ఆవుల కోటయ్య, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, కె.శ్రీగిరీష, వి.ప్రవీణ్, కె.రాజేష్, రిమ్మనపూడి నరసింహరావు, కుర్రా యశ్వంత్‌కుమార్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### కళాకారిణి భవానికి సత్కారం



తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటరులో ఆదివారం ఆఖరు చిత్రంగా 264వ సినిమా 'దాన వీర శూర కర్ణ'ను ప్రదర్శించారు. ప్రముఖ రంగస్థల నటి దేవరపల్లి భవానీని థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, సినీ నిర్మాత కొమ్మినేని వెంకటేశ్వరరావు, థియేటర్ యాజమాన్యం పెమ్మసాని పోతురాజులు సత్కరించారు. కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని వీరరాఘవరావు ప్రభృతులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ 100వ జయంతి కేక్‌ను థియేటర్ కమిటీ సభ్యులు కట్‌చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల కమిటీల ఎన్నిక



వేమూరు బస్టాండ్ సెంటరులో కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం

వేమూరు: వేమూరు నియోజక వర్గంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీలు ఎంపిక చేయడం జరిగిందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి యల్లమాటి దాసు తెలిపారు. వేమూరు బస్టాండ్ సెంటరులో మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ పని చేస్తుందని తెలిపారు. కొల్లూరు, చుండూరు మండలాల అధ్యక్షులుగా దివ్యసాగర్, చొప్పర బాలరాజు, నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా మున్నంగి ఐజక్‌ను ఏక్ర గ్రీవంగా ఎన్ను కోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అధ్యక్షుడు క్రాప నాని, ఆలపాటి అరవింద్, పచ్చిగళ్ల అనిల్, అత్తోట కిషన్ కుమార్, ఆలపాటి మధు, చావలి చందు, చుండూర జీవన్, ఎలిచర్ల సురేష్, ఆలపాటి అశోక్, నల్లూరు పాల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు విలవిల



కొల్లూరులో ఇంటి రేకుల పై తాటాకు కప్పుతున్న చిన్నారులు



కొల్లూరులో నిర్మానుష్యంగా మారిన ప్రధాన సెంటర్

కొల్లూరు: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోహిణి కార్తెలో రోళ్ల బద్ధలవుతాయన్న నానుడిని నిదర్శనంగా ఎండలున్నాయి. ఆదివారం ఉదయం నుంచి భానుడు భగ భగల కారణంగా ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఎండ తాకిడికి తోడు ఉక్కపోతలు అధికమవడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితికి గురయ్యారు. కూలర్లు నడుస్తున్నా.. ఫ్యాన్లు తిరుగుతున్నా.. వేడి గాలి నుంచి తప్పించుకోలేకున్నారు. రేకుల గృహస్తులు ఎండ వేడిమి తట్టుకోలేక.. రేకులపై తాటాకులు కప్పుకుంటున్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా ప్రజలు రోడ్ల పైకి రావడానికి కూడా జంకుతున్నారు. కొల్లూరులోని ప్రధాన సెంటర్లు నిర్మానుష్యంగా మారాయి.

# వైభవంగా లక్ష మల్లెపూల పూజ



లక్ష మల్లెపూల పూజ అందుకున్న స్వరాజ్యలక్ష్మి అమ్మవారు



మల్లెపూల పూజ చేస్తున్న మహిళలు

రేపల్లె రూరల్: పట్టణంలోని రైలుపేటలో వేంచేసియున్న పట్టాభిరామస్వామి ఆలయంలో స్వరాజ్యలక్ష్మి అమ్మవారికి శనివారం రాత్రి వైభవంగా లక్ష మల్లె పూలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి లక్ష మల్లె పూలతో సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. తమ సౌభాగ్యం నూరేళ్లు చల్లగా ఉండాలని, సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలతో శోభిల్లాలని మొక్కుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలి

**డీఎస్పీ మురళీకృష్ణ**



రేపల్లె: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు బాధ్యతాయుతంగా ఉండాలని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాత్రిళ్లు దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వాహనాలకు డ్రైవర్‌తో పాటు అదనంగా మరో డ్రైవర్‌ను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడపటంతో పాటు నిద్రమత్తులో డ్రైవర్లు ఉండటంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు డ్రైవర్‌లకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఇటీవల రావి అనంతవరం సమీపంలో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. ప్రమాదం జరిగితే వ్యక్తులు మృతి చెందటమే కాకుండా ఆ కుటుంబాలు రోడ్డున పడతాని, ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

# ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

**రుతుస్రావంపై అవగాహన సదస్సులో మున్సిపల్ చైర్ పర్సన్ ఖలేదా నసీమ్**



ర్యాలీలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: మహిళలు ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. అంతర్జాతీయ రుతుస్రావ దినోత్సవం ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపాలిటీ మెప్మా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు రుతుస్రావంపై అవగాహన కల్పించారు. రుతుస్రావం సమయంలో మహిళలు కొందరు ఇప్పటికీ సంప్రదాయ ఆలోచనల బాధితులుగా ఉండటం విచారకరమన్నారు. ఇప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై కొందరికి అవగాహన లేకపోవటంపై ఆందోళనకరమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకుంటే ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో మెప్మా సిబ్బంది ఇదే అంశంపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు డాక్టర్ బీబీజాన్, డాక్టర్ హరిణిలు రుతుస్రావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కర పత్రాలను పంచారు. మెప్మా సీఎంఎం వి.మాధవరావు, అరుణకుమారి, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

### కోచ్ కోటేశ్వరరావుకు వీడ్కోలు

తెనాలి: స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియం ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ కాకర్ల కోటేశ్వరరావును ఆదివారం పలువురు అభినందించారు. మూడేళ్లుగా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన మూడు వాలీబాల్ కోర్టులను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం విజయవాడలోని 'శాప్' కార్యాలయంలో స్పోర్ట్స్ అధికారిగా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో పలువురు ఆయనను సత్కరించి, వీడ్కోలు పలికారు. రాజేంద్రకుమార్‌రెడ్డి, అచ్యుత సాంబశివరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో వీఆర్వో మృతి



కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన వీఆర్వో బాగంటి మురళీకృష్ణారెడ్డి(45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ప్రస్తుతం మున్నంగి గ్రామ వీఆర్వోగా పని చేస్తున్నారు. మురళీకృష్ణారెడ్డి మృత దేహానికి తహసీల్దారు జి.నాంచారయ్య, డీటీ బాలకృష్ణారెడ్డి , సివిల్ సప్లయిస్ డీటీ మూర్తి, దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, ఉప సర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు ఉమామహేశ్వరెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, వీఆర్వోలు నివాళులర్పించారు.